ఇది కద నిజం
సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
No Monthly Targets
* terms and conditions apply
6300490170-9848983329
Www.edikadanijam.com
Edikadanijam@gmail.com

Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

ఇది కద నిజం
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
No Monthly Targets
6300490170-9848983329
Www.edikadanijam.com
Edikadanijam@gmail.com

బుధవారం 04-03-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 265 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## అధికారాన్ని అడ్డం పెట్టుకొని 'వ్యాపారాలు'

# సీఎం చేతిలో ఐఏఎస్‌ల అవినీతి చిట్టా!



- ➩'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'పై దిశానిర్దేశం
- ➩రియల్ ఎస్టేట్, ఇసుక మాఫియాతో కుమ్మక్కు ఆరోపణలు
- ➩ఫైళ్లకు రేట్లు ఫిక్స్ చేసిన అధికారులపై చర్చ
- ➩పనితీరుపై సీఎస్ నివేదిక.. కౌన్సెలింగ్‌కు సిద్ధం
- ➩ఫీల్డ్ విజిట్స్‌లో నిర్లక్ష్యం.. కలెక్టర్లపై అసంతృప్తి
- ➩మహబూబాబాద్ కలెక్టర్ బదిలీపై సంచలనం
- ➩అవినీతి అధికారులపై మరిన్ని చర్యలకు సంకేతాలు

న్యూస్ డెస్క్, 03 మార్చి (ఇది కద నిజం)

ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు.. అధికారాన్ని అడ్డం పెట్టుకుని పెద్ద ఎత్తున దందాలు చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కొందరు రియల్ ఎస్టేట్, బిల్డర్స్, అక్రమ ఇసుక వ్యాపారులతో చేతులు కలిపి ఆర్థిక ప్రయోజనం పొందినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న ఐఏఎస్ అధికారుల జాబితా సీఎం చేతికి చేరినట్లు తెలిసింది. దీంతో నేడు సెక్రెటేరియట్‌లో జరిగే కాన్ఫరెన్స్‌లో అలాంటి అధికారులకు సీఎం క్లాస్ తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చే అవకాశమున్నట్లు సెక్రెటేరియట్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

మిగతా 2 లో

## ఖతార్‌లోని భారతీయులకు 'ఎమర్జెన్సీ అడ్వైజరీ'.. భారత ఎంబసీ హెచ్చరిక




2 లో

## డ్యూరాండ్ లైన్ ఔట్ పోస్టుపై దాడి.. పాక్ సైన్యాన్ని హతమార్చిన తాలిబన్లు



2 లో

## యాదాద్రి జిల్లాలో ఘోరం.. ఇద్దరు పిల్లలను చంపి తల్లి బలవన్మరణం



2 లో

## బంగాళాఖాతంలో ద్రోణి.. రాష్ట్రంలో మళ్లీ వర్షాలు



2 లో

## జర భద్రం.. మీ వాట్సాప్‌కు వచ్చే హోలీ లింకులు మిమ్మల్ని ముంచేయవచ్చు!




2 లో

## స్కానింగ్ సెంటర్ టాయిలెట్‌లో 16 ఏళ్ల బాలికకు ప్రసవం



2 లో

## బతికుండగానే డెత్ సర్టిఫికెట్లు సృష్టించి రూ.1.52 కోట్లు కొట్టేశారు




2 లో

## మూసీ ప్రాజెక్టులో కీలక పరిణామం.. చెట్ల నరికివేతపై హెచ్‌హెచ్‌ఆర్సీ కేసు నమోదు

- సోషల్ ఇంపాక్ట్ స్టడీ లేకుండానే పనులా?
- లంగర్ హౌస్-నార్సింగి ప్రాంతాల్లో వివాదం
- ప్రాజెక్టు అమలుపై చట్టపరమైన ప్రశ్నలు
- ప్రభావిత కుటుంబాలకు పరిహారం డిమాండ్
- పర్యావరణ రక్షణకు న్యాయపోరాటం




2 లో

## టీ కాంగ్రెస్‌లో సస్పెన్స్ కంటిన్యూ.. రాజ్యసభ అభ్యర్థులపై పీసీసీ చీఫ్ కీలక వ్యాఖ్యలు


- రాహుల్ గాంధీతో భేటీ.. క్లారిటీ లేదు
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలు
- అన్ని సమీకరణాలపై ఏఐసీసీ కసరత్తు
- ఢిల్లీకి రాష్ట్ర నాయకత్వం ప్రయాణం
- నేడు అభ్యర్థుల ప్రకటనపై ఉత్కంఠ



2 లో

## కాంగ్రెస్ సర్కార్‌ది 'రియల్ ఎస్టేట్' దందా

### పొంగులేటి అక్రమ మైనింగ్‌పై హరీష్ రావు ఫైర్



2 లో

న్యూస్ డెస్క్, 03 మార్చి (ఇది కద నిజం): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ మైనింగ్, రియల్ ఎస్టేట్ మాఫియాకు అడ్డాగా మారిందని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాజేంద్రనగర్ మానస హిల్స్ ప్రాంతంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన 'రాఘవ కన్‌స్ట్రక్షన్స్' ఎలాంటి అనుమతులు లేకుండా కొండలను పిండి చేస్తూ అక్రమ క్వారీయింగ్ నిర్వహిస్తోందని ఆయన ఆరోపించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ నిర్వహిస్తున్న క్వారీకి పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (పిసిబి), పర్యావరణ అనుమతులు (ఈసీ), మైనింగ్ లీజ్, కనీసం మున్సిపల్,ఎచ్ఎండిఏ అనుమతులు కూడా లేవని హరీష్ రావు స్పష్టం చేశారు. విస్ఫోటక పదార్థాల వినియోగానికి ఉండాల్సిన ఎక్స్‌ప్లోజివ్ లైసెన్స్ కూడా లేకుండానే కొండలను మాయం చేస్తున్నారని మండిపడ్డారు.

**హైడ్రాపై తీవ్ర విమర్శలు..**

పేదల ఇళ్లను కూల్చే హైడ్రా బుల్డోజర్లకు, మంత్రులు, వారి బంధువులు చేస్తున్న ఈ భూకబ్జాలు, అక్రమ క్వారీలు ఎందుకు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. సామాన్యులకు ఒక న్యాయం, మంత్రులకు ఒక న్యాయమా అని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి తన అల్లుడి అనుయాయులకు ఎలాంటి ఓపెన్ బిడ్డింగ్ లేకుండా 17 ఎకరాల ప్రభుత్వ భూమిని నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టారని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో నష్టం వాటిల్లిందని ఆరోపించారు.

## ఖమేనీ మరణాన్ని ఎందుకు ఖండించలేదు

### మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సోనియాగాంధీ



2 లో

న్యూస్ డెస్క్, 03 మార్చి (ఇది కద నిజం): ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ హత్యను ఎందుకు ఖండించలేదని మోడీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ నిలదీశారు. "నిశ్శబ్దం తటస్థం కాదు" అని పేర్కొన్నారు. అసలెందుకు మౌనం వహించారని తప్పుబట్టారు. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లోని ఒక కాలమ్‌లో "టెహ్రాన్‌తో న్యూఢిల్లీ సంబంధాలు", నాగరికత- వ్యూహాత్మకమైనవి" అని సోనియాగాంధీ పేర్కొన్నారు.

ఖమేనీ హత్యపై భారత ప్రభుత్వం స్పందించకపోవడం అంతర్జాతీయ న్యాయ, సార్వభౌమత్వానికి విరుద్ధమని తెలిపారు. ఇది మౌన సమ్మతిగా భావించబడే ప్రమాదం ఉందని చెప్పారు.

## హార్మూజ్ జలసంధి దిగ్బంధం : భారత్‌కు ముంచుకొస్తున్న

# చమురు కరువు.. ధరల మోత తప్పదా?

న్యూస్ డెస్క్, 03 మార్చి (ఇది కద నిజం): ప్రపంచ దేశాలు గల్ఫ్ యుద్ధం కారణంగా ఏదైతే జరగకూడదని భయపడ్డాయో అదే జరుగుతోంది. ప్రపంచ చమురు వ్యాపారానికి గుండెకాయ వంటి హార్మూజ్ జలసంధి మూతపడటంతో భారత్‌కు రావాల్సిన క్రూడ్ ఆయిల్ సరఫరా నిలిచిపోయింది. దీంతో దేశంలో త్వరలోనే తీవ్ర చమురు కొరత ఏర్పడే అవకాశం ఉంది. అంతేకాదు ఆయిల్ ధరలు భారీగా పెరిగి ఆ ఎఫెక్ట్ నిత్యావసర ధరలపై పడనుంది.

**ముంచుకొస్తున్న చమురు కరువు ముప్పు**

మధ్యప్రాచ్యంలో ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం పతాక స్థాయికి చేరడంతో, ఇరాన్ తన అత్యంత శక్తివంతమైన ఆయుధాన్ని ప్రయోగించింది. ప్రపంచ దేశాలకు హెచ్చరికగా వ్యూహాత్మక హార్మూజ్ జలసంధిని ఇరాన్ సైన్యం పూర్తిగా మూసివేసింది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే క్రూడ్ ఆయిల్‌లో సుమారు 20 నుండి 30 శాతం వాటా ఈ సముద్ర మార్గం గుండానే సాగుతుంది. ఇప్పుడు ఈ మార్గం బంద్ కావడంతో సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్ మరియు ఇరాక్ నుండి భారత్‌కు రావాల్సిన చమురు ట్యాంకర్లు సముద్రం మధ్యలోనే నిలిచిపోయాయి. భారత్ తన అవసరాలకు అవసరమైన చమురులో దాదాపు 80 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది, అందులో అధిక భాగం ఈ మార్గం ద్వారానే వస్తుంది. ఈ ఆకస్మిక పరిణామంతో భారత ఇంధన రంగంలో ఒక్కసారిగా కలకలం రేగింది.



2 లో

హార్మూజ్ మార్గం నిలిచిపోవడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర ఒక్క రోజులోనే సుమారు 15% నుండి 20% వరకు పెరిగింది. నిన్నటి వరకు బ్యారెల్ ధర సుమారు 85 నుండి 90 డాలర్ల మధ్య ఉండగా, ఇరాన్ హెచ్చరికలు మరియు సరఫరా నిలిచిపోవడంతో అది ఇప్పుడు 110 నుండి 125 డాలర్ల మార్కును దాటేసింది.

## ఇరాన్-అమెరికా యుద్ధం..

### ప్రత్యేక విమానాల్లో భారతీయుల తరలింపు

- ఎయిర్ ఇండియా రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభం
- విమాన సర్వీసుల రద్దుతో గందరగోళం
- దుబాయ్, అబుదాబి నుంచి ప్రత్యేక విమానాలు
- 149 మంది ప్రయాణికులు ఢిల్లీ చేరిక
- 357 అంతర్జాతీయ సర్వీసుల రద్దు
- ఇండిగో ప్రత్యేక విమానాలతో తరలింపు



2 లో

## ఖతార్‌లోని భారతీయులకు 'ఎమర్జెన్సీ అడ్వైజరీ'.. భారత ఎంబసీ హెచ్చరిక

న్యూస్ డెస్క్, 03 మార్చి (ఇది కద నిజం): పశ్చిమ ఆసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో ఖతార్ రాజధాని దోహాలోని భారత రాయబార కార్యాలయం అక్కడి భారతీయుల కోసం అత్యవసర ప్రయాణ హెచ్చరికలను జారీ చేసింది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా భారతీయ పౌరులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎంబసీ సూచించింది. యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ప్రజలెవరూ అనవసరంగా ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, సురక్షితమైన ప్రదేశాల్లోనే ఉండాలని ఎంబసీ స్పష్టం చేసింది. యుద్ధానికి సంబంధించి ఖతార్ ప్రభుత్వ అధికారిక ఛానళ్లు విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని, అనధికారిక వనరుల ద్వారా వచ్చే వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది. ఇక సోషల్ మీడియాలో వచ్చే ఊహాగానాలను, తప్పుడు ప్రచారాలను నమ్మి ఆందోళన చెందవద్దని, వాటిని ఇతరులకు షేర్ చేయవద్దని కోరింది. పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని రాయబార కార్యాలయం భారత పౌరులకు సూచించింది. కాగా, గల్ఫ్ రీజియన్‌లో మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు, పెరుగుతున్న ఉద్రిక్తతల దృష్ట్యా, ఖతార్‌లోని లక్షలాది మంది భారతీయుల భద్రతపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలోనే భారత ఎంబసీ బుధవారం ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది.

## యాదాద్రి జిల్లాలో ఘోరం.. ఇద్దరు పిల్లలను చంపి తల్లి బలవన్మరణం

న్యూస్ డెస్క్, 03 మార్చి (ఇది కద నిజం): యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలో ఘోర విషాదం చోటుచేసుకుంది. కుటుంబ కలహాలతో ఓ కుటుంబమే చిన్నాభిన్నమైంది. బీబీనగర్ మండలంలోని గొల్లగూడెం గ్రామంలో ఈ విషాద ఘటన జరిగింది. గ్రామానికి చెందిన మేకల మహేష్ యాదవ్ భార్య ఐశ్వర్య ఆత్మహత్యకు పాల్పడింది.స్థానికుల వివరాల ప్రకారం.. దంపతుల మధ్య గత ఆరు నెలలుగా కుటుంబ విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ కారణంగా ఐశ్వర్య తన ఇద్దరు పిల్లలతో కలిసి అమ్మగారింటికి వెళ్లి ఉంటోంది. సోమవారం కుటుంబ సభ్యులు ఆమెను భర్త ఇంటికి తీసుకొచ్చి వదిలి వెళ్లారు. అయితే, సోమవారం రాత్రి ఐశ్వర్య తీవ్ర మనస్తాపంతో తన ఇద్దరు చిన్నారులను మెత్తతో ఊపిరాడకుండా చేసి హతమార్చింది. అనంతరం తాను ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లుగా స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒకేసారి ముగ్గురు మృతిచెందంతో గొల్లగూడెం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## అధికారాన్ని అడ్డం పెట్టుకొని 'వ్యాపారాలు' సీఎం చేతిలో ఐఏఎస్‌ల అవినీతి చిట్టా!

మొదటి పేజీ తరువాయి

నిఘా వర్గాల రిపోర్ట్

నేడు సెక్రెటేరియట్‌లోని 8వ అంతస్తులో కలెక్టర్లు, సెక్రెటరీలతో సీఎం రేవంత్ సమావేశం కానున్నారు. ఈనెల 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు నిర్వహించనున్న 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. కాగా, కొందరు బ్యూరోక్రట్స్ పనితీరుపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు, ఆరోపణలు రావడంతో.. వారిపై నిఘా వర్గాలు ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డికి నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. అందులో కొందరు ఐఏఎస్‌లు క్షేత్ర స్థాయిలో తమ అధికారాన్ని ఉపయోగించుకుని పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆధారాలు సమర్పించినట్లు సమాచారం. రియల్ ఎస్టేట్, బిల్డర్స్‌తో కుమ్మక్కై వాటాలు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని జిల్లాల్లో ఇసుక అక్రమాలకు పాల్పడే ముఠాలతో చేతులు కలిపి భారీ ఎత్తున ఆర్థిక ప్రయోజనం పొందినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. కొందరు ఆఫీసర్లు తమ టేబుల్ వద్దకు వచ్చే ప్రతి ఫైల్‌కు ఒక్కో రేటు ఫిక్స్ చేసి మరీ వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాంటి ఆఫీసర్లను గుర్తించి ఇప్పటికే కొందరిని అక్కడి నుంచి బదిలీ చేశారు. మరికొందరికి కౌన్సెలింగ్ ఇచ్చి కొంత గడువు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.

పనితీరుపై నివేదిక

కలెక్టర్లు, సెక్రెటరీల పనితీరుపై సీఎస్ రామకృష్ణారావు విడివిడిగా నివేదికలు రెడీ చేసి సీఎం రేవంత్ రెడ్డికి అందజేసినట్టు తెలిసింది. ఆ నివేదికల ఆధారంగా సీఎం వారికి కౌన్సెలింగ్ ఇచ్చే అవకాశం ఉంది. గతంలో జరిగిన సెక్రెటరీ, కలెక్టర్ల మీటింగ్‌లో.. ప్రతి అధికారి వారంలో ఒకసారైనా ఫీల్డ్ విజిట్‌కు వెళ్లాలని, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షించాలని సీఎం ఆదేశించారు. కలెక్టర్లు గురుకులాలకు వెళ్లి పిల్లలతో కలిసి భోజనం చేయాలని సూచించారు. కానీ అప్పటి నుంచి ఇప్పటివరకు ఫీల్డ్ మోహం చూడని కలెక్టర్లు/సెక్రెటరీల జాబితా చాలా పెద్దదిగా ఉన్నట్లు తెలుస్తున్నది. ఒకరిద్దరు సీనియర్ సెక్రెటరీలు మినహా మిగతా అధికారులు ఎవరూ ఫీల్డ్‌కు వెళ్లలేదని విమర్శలు ఉన్నాయి. అలాగే, కలెక్టర్లు సైతం క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లేందుకు సుముఖంగా లేరనే చర్చ జరుగుతున్నది. అలాంటి ఆఫీసర్లకు సీఎం క్లాస్ తీసుకునే అవకాశం ఉంది.

అవినీతి ఆఫీసర్లపై చర్యలు ఇలా..

-పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌పై ఫిర్యాదులు రావడంతో.. ఆయన్ను అక్కడి నుంచి బదిలీ చేశారు. దీంతో స్థానికులు టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుకుని సంబురాలు చేసుకున్నారు.

– ఉత్తర తెలంగాణలోని ఓ జిల్లాకు చెందిన కలెక్టర్ ప్రతి పనికీ ఓ రేటు ఫిక్స్ చేసి అవినీతికి పాల్పడుతున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఆయన్ను దక్షిణ తెలంగాణకు చెందిన ఓ చిన్న జిల్లాకు బదిలీ చేశారు.

– హెల్త్ డిపార్ట్ మెంట్‌లో పని చేస్తున్న ఓ అధికారి డబ్బులు ఇచ్చిన తరువాతే పనులు చేస్తానని కండీషన్ పెడుతున్నట్టు తెలియడంతో.. ఆయన్ను దక్షిణ తెలంగాణలోని ఓ జిల్లాకు అడిషనల్ కలెక్టర్‌గా నియమించారు.

– ఓ కీలకమైన శాఖలో స్పెషల్ సెక్రెటరీగా పని చేస్తున్న ఓ ఐఏఎస్.. పైసలు చేతికి అందిన తర్వాతే ఫైల్ క్లియర్ చేసేందుకు అలవాటు పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆయన్ను అక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ చేసేందుకు సిద్ధమైతే.. ఓ సీనియర్ నేత అడ్డుపడ్డారని ప్రచారం జరుగుతున్నది.

– ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి సరిగా పనిచేయట్లేదని, అవినీతికి పాల్పడుతున్నారని ఫిర్యాదులు రావడంతో ఆయన్ను ఏడాది క్రితం అంతగా ప్రయారిటీ లేని శాఖ బాధ్యతలు అప్పగించారు. కానీ ఆ శాఖలో కూడా ఫైల్‌పై సంతకం పెట్టేందుకు ఒక్కో రేటు ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. దీంతో ఆయన్ను ఏ శాఖకు బదిలీ చేయాలో ప్రభుత్వ పెద్దలకు అర్థం కావట్లేదని టాక్.

## కాంగ్రెస్ సర్కార్‌ది 'రియల్ ఎస్టేట్' దందా పొంగులేటి అక్రమ మైనింగ్‌పై హరీష్ రావు ఫైర్

మొదటి పేజీ తరువాయి



గనుల శాఖ, పర్యావరణ శాఖ మంత్రులు ఈ అక్రమాలను చూస్తూ ఎందుకు మౌనంగా ఉంటున్నారని, ఇందులో ఎవరెవరికి ఎంత వాటాలు అందుతున్నాయని హరీష్ రావు ప్రశ్నించారు.

మంత్రి పొంగులేటి సంస్థపై తక్షణమే చర్యలు తీసుకుని, అక్రమ క్వారీని మూసివేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు కొల్లగొట్టిన సహజ సంపదను పెనాల్టీతో సహా రికవరీ చేయాలన్నారు. సీఎం అల్లుడి అనుయాయులకు కేటాయించిన 17 ఎకరాల భూమిని రద్దు చేసి, పారదర్శకంగా ఓపెన్ బిడ్డింగ్ నిర్వహించాలని పేర్కొన్నారు. అక్రమ మైనింగ్‌కు సంబంధించిన ఆధారాలు, ఫోటోలు మీడియా ముందు పెడుతున్నానని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే స్వయంగా తానే వెళ్లి క్షేత్రస్థాయిలో నిజానిజాలు నిగ్గు తేలుస్తానని హరీష్ రావు హెచ్చరించారు.

## మూసీ ప్రాజెక్టులో కీలక పరిణామం.. చెట్ల నరికివేతపై హెచ్‌హెచ్‌ఆర్సీ కేసు నమోదు

న్యూస్ డెస్క్, 03 మార్చి (ఇది కద నిజం): మూసీ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుపై జాతీయ మానవ హక్కుల కమిషన్?లో కేసు నమోదు అయింది. మూసీ ప్రాజెక్టు పేరుతో ఈ నది తీర ప్రాంతాల్లో విపరీతమైన పర్యావరణ విధ్వంసం జరుగుతోందని దీన్ని అడ్డుకోవాలని ప్రముఖ మానవ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మనేని హెన్‌ఎచ్?ఆర్?సీని ఆశ్రయించారు. ఎలాంటి సమగ్ర అధ్యయనం లేకుండా లంగర్ హౌస్, నార్సింగి, రాందేవ్‌గూడ ప్రాంతాల్లో శతాబ్దాల నాటి వేలాది చెట్లను నరికివేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పర్యావరణ ప్రభావం, సామాజిక ప్రభావంపై ఎటువంటి సోషల్ ఇంపాక్ట్ స్టడీ నిర్వహించకుండా పనులు ప్రారంభించారని ఆయన తన ఫిర్యాదులో ఆరోపించారు. చెట్ల నరికివేతను నిలిపివేయించండి: ప్రజల జీవనాధారాలపై తీవ్ర ప్రభావం చూపే విధంగా మూసీ తీరాలను ధ్వంసం చేస్తున్నారని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు అమలు సంస్థ అయిన మూసీ రివర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఈ.వి. నరసింహా రెడ్డికి చెట్ల నరికివేతను తక్షణమే నిలిపివేయాలని, పర్యావరణానికి హానికరమైన పనులను ఆపేలా ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశాలు జారీ చేయాలని రామారావు ఇమ్మనేని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రాజెక్ట్ ప్రభావిత కుటుంబాలకు తగిన పరిహారం అందించాలని కోరారు. ఈ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న హెన్‌ఎచ్‌ఆర్సీ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. పర్యావరణ పరిరక్షణలో నిర్లక్ష్యం సహించబోమని మూసీ తీరాల రక్షణకు చట్టపరమైన పోరాటం కొనసాగుతుందని రామారావు ఇమ్మనేని స్పష్టం చేశారు.

## డ్యూరాండ్ లైన్ ఔట్ పోస్టుపై దాడి.. పాక్ సైన్యాన్ని హతమార్చిన తాలిబన్లు

న్యూస్ డెస్క్, 03 మార్చి (ఇది కద నిజం): డ్యూరాండ్ లైన్ వద్ద పాకిస్థాన్-ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. తాలిబన్ల దాడిలో పాక్ సైన్యం భారీగా ప్రాణనష్టాన్ని చవిచూసింది. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దులను వేరుచేసే వివాదాస్పద డ్యూరాండ్ లైన్ వద్ద మరోసారి తుపాకుల మోత మోగింది. తాజా సమాచారం ప్రకారం.. డ్యూరాండ్ సరిహద్దు వెంబడి ఉన్న పాకిస్థాన్ సైనిక అవుట్‌పోస్ట్‌పై ఆఫ్ఘన్ తాలిబన్ ఫైటర్లు భారీ ఆయుధాలతో విరుచుకుపడ్డారు. ఈ ఆకస్మిక దాడిలో పలువురు పాక్ సైనికులు హతమవ్వగా, మరికొందరు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. డ్యూరాండ్ లైన్ వద్ద పాక్ సైన్యం నిర్మిస్తున్న ఫెన్సింగ్ (కంచె)ను తాలిబన్లు ఎప్పటి నుండో వ్యతిరేకిస్తున్నారు. ఈ వివాదమే తాజా ఘర్షణకు దారితీసినట్లు తెలుస్తోంది. తాలిబన్లు అత్యాధునిక అమెరికన్ మేడ్ రైఫిళ్లు, రాకెట్ లాంచర్లను ఉపయోగించి పాక్ ఆర్మీ బంకర్లను ధ్వంసం చేయడం ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది.

ఈ దాడి పాకిస్థాన్ అంతర్గత భద్రతకు పెద్ద సవాలుగా మారింది. ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు అధికారంలోకి వచ్చినప్పటి నుండి డ్యూరాండ్ లైన్ వద్ద ఇరు దేశాల సైన్యాల మధ్య కాల్పులు సాధారణం అయ్యాయి. పాకిస్థాన్ ప్రభుత్వం ఈ దాడులను "తీవ్రవాద చర్య"గా అభివర్ణిస్తుండగా, తాలిబన్ల ప్రతినిధులు మాత్రం తమ భూభాగంలో పాక్ అక్రమ నిర్మాణాలను అడ్డుకుంటున్నామని వాదిస్తున్నారు. ఈ ఘర్షణల వల్ల సరిహద్దు గ్రామాల్లోని ప్రజలు భయంతో ఇళ్లను వదిలి వెళ్ళిపోతున్నారు. పాక్ ఆర్మీ ఇప్పుడు ఈ ప్రాంతానికి అదనపు బలగాలను, హెలికాప్టర్లను పంపించి ప్రతిదాడికి సిద్ధమవుతోంది. ఇది గనుక పూర్తిస్థాయి యుద్ధంగా మారితే, ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో ఉన్న పాకిస్థాన్ ఎకానమీలో మరింత దిగజారిపోనుంది.

## బంగాళాఖాతంలో ద్రోణి.. రాష్ట్రంలో మళ్లీ వర్షాలు

న్యూస్ డెస్క్, 03 మార్చి (ఇది కద నిజం): తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. రానున్న 24 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాలో భానుడి భగభగలు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. నిన్న దేశంలోనే అత్యధికంగా కర్నూలులో 38°C ఉష్ణోగ్రత నమోదై ఎండల తీవ్రతను చాటిచెప్పింది. అయితే, ఇదే సమయంలో అల్లూరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో అసాధారణంగా పొగమంచు కురుస్తుండటం వాతావరణంలోని మార్పులకు సంకేతం గా కనిపిస్తోంది. తీవ్రమైన ఎండ కారణంగా ఇప్పటికే మామిడి పిందెలు రాలిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆగ్నేయ బంగాళాఖాతంలో ద్రోణి..

ఓవైపు ఎండలు మండిపోతున్న క్రమంలో వాతావరణ శాఖ కీలక అలర్ట్ జారీ చేసింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం రానున్న నాలుగు రోజుల్లో ద్రోణిగా బలపడనుంది. దీని ప్రభావంతో ఈ నెల 7వ తేదీ తర్వాత కోస్తాంధ్రలోని పలు ప్రాంతాల్లో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఎండాకాలం ప్రారంభంలోనే ఇలాంటి అకస్మాత్తు మార్పులు రావడం మామిడి తోటలపై తీవ్ర ప్రభావం చూపనుంది. ముఖ్యంగా పూత, పిందె దశలో ఉన్న తోటలకు ఈ అకాల వర్షాలు, ఈదురు గాలులు కోలుకోలేని దెబ్బ తీసే ప్రమాదం ఉంది.

అకాల వర్షాల వల్ల మామిడి తోటల్లో తేమ శాతం పెరిగి తెగుళ్లు సోకే అవకాశం ఉన్నందున రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారులు సూచిస్తున్నారు. వర్షం పడే సూచనలు ఉన్నందున తోటల్లో మందుల పిచికారీని తాత్కాలికంగా వాయిదా వేసుకోవడం మంచిది. అలాగే, వర్షపు నీరు తోటల్లో నిల్వ ఉండకుండా చూసుకోవాలని, గాలి వానల వల్ల కాయలు రాలకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని రైతులను అప్రమత్తం చేస్తున్నారు.

## ఖమేనీ మరణాన్ని ఎందుకు ఖండించలేదు మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సోనియాగాంధీ

మొదటి పేజీ తరువాయి

చర్చలు కొనసాగుతున్న సమయంలో ఒక దేశాధినేతను హత్య చేయడం సమకాలీన అంతర్జాతీయ సంబంధాల్లో తీవ్రమైన విఘాతంగా పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో భారత్ స్పష్టంగా సార్వభౌమత్వం, అంతర్జాతీయ చట్టాల పరిరక్షణకు మద్దతు ఇవ్వకపోవడం దేశ విదేశాంగ విధాన దిశపై సందేహాలు కలిగిస్తోందని అన్నారు.

ఆశ్చర్యంగా ఇరాన్ జరిపిన ప్రతీకార దాడులను మాత్రం ప్రధాని మోడీ ఖండించారని.. కానీ వాటికి దారితీసిన పరిణామాలపై ఎందుకు స్పందించలేదని నిలదీశారు. ఖమేనీ హత్యకు కొద్ది రోజుల ముందే ప్రధాని మోడీ ఇజ్రాయెల్‌ను సందర్శించి.. నెతన్యాహు ప్రభుత్వానికి మద్దతు ప్రకటించడం సమయస్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. రష్యా, చైనా వంటి దేశాలు జాగ్రత్త వైఖరిని అవలంబిస్తున్న సమయంలో భారత్ వైఖరి సంప్రదాయ విదేశాంగ సూత్రాలకు విరుద్ధంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఈ అంశంపై బడ్జెట్ సమావేశాల రెండో విడతలో పార్లమెంటులో చర్చ నిర్వహించాలని సోనియా గాంధీ డిమాండ్ చేశారు.

## స్కానింగ్ సెంటర్ టాయిలెట్‌లో 16 ఏళ్ల బాలికకు ప్రసవం

న్యూస్ డెస్క్, 03 మార్చి (ఇది కద నిజం): స్కానింగ్ సెంటర్‌లోని టాయిలెట్‌లోనే 16 ఏళ్ల బాలిక ప్రసవించింది. నాగర్‌కర్నూల్‌లో సోమవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనం రేపింది.

వివరాల్లోకి వెళ్తే.. కడుపునొప్పితో బాధపడుతున్న బాలిక తన తల్లితో కలిసి సోమవారం నాడు ఆస్పత్రికి వెళ్లింది. అక్కడ బాలికను పరిశీలించిన వైద్యులు స్కానింగ్ అవసరమని చెప్పడంతో.. ప్రైవేటు స్కానింగ్ సెంటర్‌కు వెళ్లింది. అక్కడ టాయిలెట్‌కు వెళ్లిన సమయంలో బాలికకు పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో బాలిక తల్లి సాయంతో సాధారణ ప్రసవం జరిగింది. పండంటి మగ శిశువుకు బాలిక జన్మనిచ్చింది. అనంతరం ఆ శిశువును చెత్తబుట్టలో వేసేందుకు బాలిక తల్లి ప్రయత్నించింది. ఇది గమనించిన సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు స్కానింగ్ సెంటర్‌కు చేరుకుని.. బాలిక, శిశువును నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారిని పరీక్షించిన వైద్యులు.. ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## హర్మూజ్ జలసంధి దిగ్బంధం : భారత్‌కు ముంచుకొస్తున్న చమురు కరువు.. ధరల మోత తప్పదా?

మొదటి పేజీ తరువాయి

యుద్ధం గనుక మరికొన్ని రోజులు ఇలాగే కొనసాగితే, చమురు ధరలు బ్యారెల్ కు 150 డాలర్ల మార్కును కూడా చేరుకోవచ్చని గోల్డ్‌మన్ సాక్స్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఈ ఆకస్మిక పెరుగుదల వల్ల భారత్ వంటి దిగుమతులపై ఆధారపడే దేశాల కరెన్సీ విలువ (రూపాయి) కూడా పడిపోయే ప్రమాదం ఉంది. భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అంతర్జాతీయంగా బ్యారెల్ ధరలో ఒక డాలర్ 1 పెరిగితేనే, భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు దాదాపు 50 నుండి 60 పైసల వరకు పెరిగే అవకాశం ఉంటుంది. ఇప్పుడు జరిగిన భారీ పెరుగుదల ప్రకారం రాబోయే రోజుల్లో భారత్‌లో ఇంధన ధరలు లీటరుకు 10 నుండి 15 వరకు పెరిగే ముప్పు పొంచి ఉంది.

ప్రత్యామ్నాయాల వైపు దృష్టి: ఇది రవాణా రంగంపై నేరుగా ప్రభావం చూపి, పప్పులు, కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరగడానికి దారితీస్తుంది. చమురు ధరల పెరుగుదల కేవలం వాహనదారులకే కాకుండా, రవాణా ఖర్చులు పెరగడం వల్ల అన్ని ధరలపై కూడా తీవ్ర ప్రభావం చూపనుంది. భారత ప్రభుత్వం ప్రస్తుతం తన వద్ద ఉన్న 'స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్స్' ఉపయోగించి పరిస్థితిని సమీక్షిస్తోంది. అయితే, ఈ దిగ్బంధం మరికొన్ని రోజులు కొనసాగితే దేశంలో ఇంధన కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మరియు చమురు మంత్రిత్వ శాఖ ఇప్పటికే దౌత్యపరమైన చర్చలు జరుపుతూ, రష్యా వంటి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చమురు తెప్పించుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశాయి.

## జర భద్రం.. మీ వాట్సాప్‌కు వచ్చే హోలీ లింకులు మిమ్మల్ని ముంచేయవచ్చు!

న్యూస్ డెస్క్, 03 మార్చి (ఇది కద నిజం): సైబర్ నేరగాళ్లు రోజుకో రూపం దాల్చి ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో హోలీ పండుగను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు సామాన్య ప్రజలను దోచుకునేందుకు సిద్ధమయ్యారు. రంగులు, గిఫ్ట్ వోచర్లు, హోలీ ఈవెంట్ పాస్‌లపై భారీ డిస్కౌంట్లు ఉన్నాయంటూ వాట్సాప్, ఎస్ఎంఎస్, సోషల్ మీడియా ద్వారా నకిలీ లింకులను పంపిస్తున్నారు. ఈ ఆకర్షణీయమైన లింకులపై క్లిక్ చేస్తే మీ స్మార్ట్‌ఫోన్ హ్యాక్ అవ్వడమే కాకుండా, మీ బ్యాంక్ ఖాతాలోని సొమ్ము క్షణాల్లో మాయమయ్యే ప్రమాదం ఉందని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ హెచ్చరించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేహాస్పద లింకులను ఓపెన్ చేయవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.

మోసపోతే వెంటనే ఇలా చేయండి..

ఒకవేళ మీరు పొరపాటున ఇటువంటి లింకులపై క్లిక్ చేసి ఆర్థికంగా మోసపోతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 అనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలి. బాధితులు తక్షణమే స్పందిస్తే పోగొట్టుకున్న సొమ్మును రికవరీ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అలాగే www.cybercrime.gov.in పోర్టల్‌లో కూడా ఫిర్యాదు నమోదు చేయవచ్చు. పండుగ ఉత్సాహంలో అపరిచిత లింకుల పట్ల అప్రమత్తంగా ఉండి మీ వ్యక్తిగత సమాచారాన్ని, ఓటీపీలను ఎవరితోనూ పంచుకోకూడదని అధికారులు స్పష్టం చేశారు.

## బతికుండగానే డెత్ సర్టిఫికెట్లు సృష్టించి రూ.1.52 కోట్లు కొట్టేశారు

న్యూస్ డెస్క్, 03 మార్చి (ఇది కద నిజం): భద్రాచలం ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. నకిలీ పత్రాలతో నిరుపేదలపై ఇన్సూరెన్స్ తీసుకుని.. ఆపై వారు చనిపోయినట్లుగా చిత్రీకరించి కోట్లు కాజేసినట్లు తెలిసింది. ఈ ఘరానా మోసం ద్వారా దాదాపు రూ.1.52 కోట్లను కాజేసినట్లుగా తేలింది.

వివరాల్లోకి వెళ్తే.. అశ్వాపురం మండలానికి చెందిన కొంతమంది ఏజెంట్లు ఓ ముఠాగా ఏర్పడ్డారు. ఎల్ఐసీ నిబంధనల్లో లొసుగులను ఆసారాగా చేసుకున్నారు. నేరుపేదల పేరిట నకిలీ పత్రాలతో పాలసీలు తీసుకున్నారు. అనంతరం వారు చనిపోయినట్లుగా తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాలను సృష్టించారు. అలా కోటిన్నర రూపాయలకు పైగా కాజేశారు. క్షేత్రస్థాయిలో విచారణ చేయాల్సిన యంత్రాంగం సైతం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం గమనార్హం.

నిద్రలేచిన అధికారులు.. పోలీసులకు ఫిర్యాదు..

అంతా అయిపోయి, ఖజానా ఖాళీ అయ్యాక గానీ ఎల్ఐసీ బ్రాంచ్ నిర్వాహకులకు అసలు విషయం బోధపడలేదు. అంతర్గత తనిఖీల్లో ఈ అక్రమాలు బయటపడటంతో లబోదిబోమంటూ వారు పోలీసులను ఆశ్రయించారు. ప్రస్తుతం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఇంత భారీ మొత్తంలో నగదు పక్కదారి పడుతున్నా ఉన్నతాధికారులు ఎందుకు గుర్తించలేకపోయారనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. భద్రాచలం బ్రాంచ్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతుండటంతో పాలసీదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బ్రాంచ్ అధికారుల సహకారం లేకుండా ఇంత పెద్ద మొత్తంలో స్కామ్ జరగడం సాధ్యమేనా? నకిలీ పత్రాలతో వెరిఫై చేయడంలో సిబ్బంది ఎందుకు విఫలమయ్యారు?. సాధారణ ప్రజలకు క్లెయిమ్ రావాలంటే నెలల తరబడి తిప్పించే అధికారులు, ఈ కేటుగాళ్లకు ఎలా సహకరించారు? అనే సందేహాలను వ్యక్తం చేస్తున్నారు.

## టీ కాంగ్రెస్‌లో సస్పెన్స్ కంటిన్యూ.. రాజ్యసభ అభ్యర్థులపై పీసీసీ చీఫ్ కీలక వ్యాఖ్యలు

న్యూస్ డెస్క్, 03 మార్చి (ఇది కద నిజం): తెలంగాణ కాంగ్రెస్?లో రాజ్యసభ టికెట్ల కోసం ఆశావహుల మధ్య పోటీ బాగా పెరిగింది. నామినేషన్లకు ఆఖరి గడువు (మార్చి5) ముంచుకొస్తున్నా అభ్యర్థుల ఎంపికపై పార్టీ ఇంకా కసరత్తు చేస్తోంది. నిన్న రాహుల్ గాంధీ పర్యటనలో అభ్యర్థుల విషయంలో క్లారిటీ వస్తుందని భావించినా అలా జరగలేదు. నిన్న ఎయిర్ పోర్టులో రాహుల్‌తో జరిగిన భేటీలో రాజ్యసభ అభ్యర్థులపై క్లారిటీ రాలేదని పీసీసీచీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. మంగళవారం మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన ఆయన రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై స్పందించారు. ఈ విషయంలో మరోసారి చర్చిస్తామని రాహుల్ గాంధీ చెప్పారని అన్నారు. రేసులో ఎవరు ఉన్నారు అనేది ఇప్పుడే చెప్పలేమని, అన్ని సమీకరణాలను బేరీజు వేసుకున్న తర్వాతే రాజ్యసభ అభ్యర్థులను ఏఐసీసీ ఖరారు చేస్తుందని స్పష్టం చేశారు.

నేడు అభ్యర్థుల ప్రకటన!:

రాజ్యసభకు పోటీ చేసే అభ్యర్థుల విషయంపై క్లారిటీ వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అభ్యర్థుల ఖరారుపై చర్చించేందుకు బుధవారం రాష్ట్ర నాయకత్వం ఢిల్లీకి వెళ్లపోతున్నట్లు తెలుస్తోంది. ఆ రోజున అభ్యర్థులను ఖరారు చేద్దామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీవేణుగోపాల్ రాష్ట్ర నాయకత్వానికి చెప్పినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర నాయకత్వం రేపు ఢిల్లీకి వెళ్లబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది.

## ఇరాన్-అమెరికా యుద్ధం.. ప్రత్యేక విమానాల్లో భారతీయుల తరలింపు

న్యూస్ డెస్క్, 03 మార్చి (ఇది కద నిజం): ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ మధ్య ఘర్షణలు మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. దీంతో పౌరవిమానయాన రంగంలో తీవ్ర అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. యుద్ధం కారణంగా పలు దేశాల్లో విమానాశ్రయాలు మూతపడటంతో వేలాది మంది ప్రయాణికులు ఎక్కడికక్కడే చిక్కుకుపోయారు. దీంతో ఆయా దేశాల్లో చిక్కుకుపోయిన భారతీయులను ఇవాళ సురక్షితంగా వెనక్కి తీసుకువస్తున్నారు. ఎయిర్ ఇండియా దుబాయ్, అబుదాబి నుండి రెస్క్యూ విమానాలను ఇవాళ నడిపింది. రెండు విమానాలు బుధవారం ఢిల్లీకి సురక్షితంగా చేరుకున్నారి. ఈ రెండు విమానాలలో 149 మంది ప్రయాణికులతో పాటు సిబ్బంది క్షేమంగా స్వదేశానికి తిరిగి వచ్చారు. క్షేమంగా భారత్ లో అడుగుపెట్టడం పట్ల ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు.

కాగా, పశ్చిమాసియా ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇండియన్ ఎయిర్‌లైన్స్ సోమవారం 357 అంతర్జాతీయ విమాన సర్వీసుల్ని రద్దు చేసింది. ఈ సర్వీసులు ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నైల నుంచి నడవాల్సి ఉంది. సౌదీలో చిక్కుకున్న భారతీయుల్ని సురక్షితంగా స్వదేశం చేర్చేందుకు ఇండిగో సంస్థ మంగళవారం 10 ప్రత్యేక విమానాలు నడపనుంది. ఈ ప్రత్యేక విమానాలు జెడ్డా నుంచి హైదరాబాద్, ముంబయి, అహ్మదాబాద్ నగరాలకు ప్రయాణికుల్ని తీసుకురానున్నాయి.

# రాజ్యసభ స్థానాల్లో మాదిగలకు అవకాశం కల్పించాలి

**• కాంగ్రెస్ అధిష్టానానికి సుధాకర్ మాదిగ విజ్ఞప్తి**



ఇది కద నిజం :తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ సామాజికవర్గానికి రాజకీయంగా సముచిత స్థానం కల్పించాలని, రాబోయే రాజ్యసభ ఎన్నికల్లో కనీసం ఒక సీటును మాదిగలకు కేటాయించాలని మండల అధ్యక్షుడు సుధాకర్ మాదిగ డిమాండ్ చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు కూడా మాదిగలకు కేటాయించకపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఏప్రిల్‌లో ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాల్లోనైనా మాదిగల అస్తిత్వాన్ని చాటేందుకు, వారి గొంతుకను దేశ అత్యున్నత సభలో వినిపించేందుకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. తెలంగాణ జనాభాలో 12 శాతం ఉన్న మాదిగల తరఫున పార్లమెంటులో ప్రాతినిధ్యం లేకపోవడం బాధాకరమని సుధాకర్ మాదిగ పేర్కొన్నారు. గతంలో దళిత ముఖ్యమంత్రి చేస్తానని కేసీఆర్ ఎలాగైతే మోసం చేశారో, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడవకూడదని ఆయన హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా తాను మందకృష్ణ మాదిగ శిష్యరికం చేశానని, మాదిగ బిడ్డల కష్టార్జితం వల్లనే జెడ్పీటీసీ స్థాయి నుండి ముఖ్యమంత్రి వరకు ఎదిగానని పలుమార్లు చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికైనా ఆ కృతజ్ఞతను చాటుకుంటూ మాదిగలకు రాజ్యసభ సీటు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. చివరగా, రాజ్యసభ సీటు కేటాయింపులో మాదిగలకు అన్యాయం జరిగితే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. అత్యధిక జనాభా కలిగిన మాదిగల ఆగ్రహానికి గురికాకముందే కాంగ్రెస్ అధిష్ఠానం మేల్కొని సరైన నిర్ణయం తీసుకోవాలని సుధాకర్ మాదిగ స్పష్టం చేశారు.

## ఉద్యోగ బాధ్యత ..వ్యక్తిగత కళాత్మకతను చాటుకున్న మున్సిపల్ కమిషనర్ రంగస్వామి



ఇది కద నిజం, మైదుకూరు ,మార్చి 03: ఒకవైపుబాధ్యతాయుతమైన ఉద్యోగం చేస్తూనే..మరోవైపు కళాకారుడిగా రాణించడం ఆయన ప్రతిభకు నిదర్శనం..ఉద్యోగ బాధ్యత..వ్యక్తిగత కళాత్మకతను రెండింటిని నిర్వర్తిస్తూ అందరి ప్రశంసలందుకుంటున్న మైదుకూరు మున్సిపల్ కమిషనర్ రంగస్వామి

ఉద్యోగం ఆర్థిక స్థిరత్వాన్ని ఇస్తే ..కళాకారుడు తాను నేర్చుకున్న కళను ప్రదర్శించడం ద్వారా గుర్తింపును ఆనందాన్ని పొందుతాడు..అనంతపురం పట్టణంలో ఎస్పీ బాలసుబ్రమణ్యం కాంస్య విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా లలిత కళా పరిషత్ లో 100 మంది గాయని గాయకులతో శత గళార్చన నిర్వహణ..దానవీరశూరకర్ణ సినిమాలో చిత్రం భళారే విచిత్రం, దుర్యోధనుడు వేషధారణలో కళాత్మకతో అదరగొట్టిన మున్సిపల్ కమిషనర్ స్వామి..ఆయన కలానైపుణ్యాంతో అచ్చం దుర్యోధనుడులా అలరించి సంగీతం అందించినందుకు ప్రశంసించి బహుమతిని ప్రధానం చేసి మెమంటోశాలువా పూల మాలతో ఘనంగాసత్కారంచేసిన సంగీత దర్శకుడు మాధవ పెద్ది సురేష్..ఒకవైపు బృహత్తరమైన ఉద్యోగ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ మరోవైపు తాను నేర్చుకున్న కలను ప్రదర్శిస్తున్న మున్సిపల్ కమిషనర్ రంగస్వామిని మైదుకూరు మున్సిపాలిటీ ప్రజలు, ఉద్యోగులు ,స్నేహితులు ,కళాకారులు అభినందిస్తున్నారు.

## చంద్రగ్రహణం సందర్భంగా పెంచలకోన ఆలయం మూసివేత




నెల్లూరు జిల్లా రాపూరు(ఇది కద నిజం) :చంద్రగ్రహణం సందర్భంగా నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోన ఆలయాన్ని మూసివేశారు. మంగళవారం నాడు కేతుగ్రాస్త సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఉదయం 9.గంటలకు నివేదన అనంతరం ఆలయాన్ని మూసివేశారు..తిరిగి బుధవారం యధావిధిగా మూడు ఆలయల్లో సంప్రోక్షణ చేసి భక్తులకు శ్రీవార్ల దర్శనం కల్పించాలని నిర్ణయించినట్లు ని దేవస్థానం ఈ. ఓ.పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

## వైసీపీ కార్యకర్తల మీద తెనాలి లో కేసు నమోదు




వైసీపీ కార్యకర్తల మీద అంగలకుదురు గ్రామానికి చెందిన జెట్టి రేణుక అను తెలుగుదేశం మహిళకార్యకర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగినది. తెలుగుదేశం పార్టీ కార్యకర్త అయిన జెట్టి రేణుక మీద సోషల్ మీడియాలో వైసీపీ పార్టీకి చెందిన కొంతమంది సోషల్ మీడియా కార్యకర్తలు అసభ్యకరంగా పోస్టులు పెట్టారు. ఆమె ఫోటోను మార్ఫింగ్ చేసి, ఆమె పరువు, ప్రతిష్టను దెబ్బ తీసే విధంగా, సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆమె గౌరవ మర్యాదలు భంగం వాటిల్లిందని, ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని,, అట్టి వ్యక్తులపై కఠినమైన , చట్ట పరంమైన చర్యలు తీసుకుంటామని తెనాలి పోలీసులు వెల్లడించారు.

## మల్లు ఇంట పెళ్లి సందడి



హైదరాబాద్ (ఇది కద నిజం): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇంట వివాహ మహోత్సవానికి వచ్చే అతిరథ మహారథుల కోసం సకల ఏర్పాట్లు, విందు, పెళ్లి వేడుకలను సిద్ధం చేస్తున్నారు. శంషాబాద్ లో GMR ARENA ఫంక్షన్ హాల్ లో ఈనెల 5న జరిగే పెళ్లికి అంగరంగ వైభవంగా ఏర్పాట్లును సిద్ధం చేస్తున్నారు. మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, గిడుగు రుద్రరాజు పర్యవేక్షించారు.

ఇవెంట్ మేనేజర్స్ కు పలు సూచనలు చేశారు. వచ్చే సామాన్యులు, కార్యకర్తలు, నాయకులు, వీఐపీలు, ప్రతి ఒక్కరికీ ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

తెలంగాణ సహా వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖులు వస్తున్నందున్న... ఆహార, వసతి సౌకర్యాలను పరిశీలించారు కాంగ్రెస్ నేతలు.

## కోనసీమ ప్రజల గుండెల్లో జీఎంసీ బాలయోగి చిరస్థాయిగా నిలిచి ఉంటుంది...

- ఈ ప్రాంత అభివృద్ధిలో అడుగడుగున ఆయన జాడలున్నాయి...
- బాలయోగి వర్ధంతి సందర్భంగా కొత్తపేటలో నివాళులు అర్పించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...



కొత్తపేట.. (ఇది కద నిజం)మర్చి. 3...కోనసీమ ముద్దుబిడ్డ, భారత లోక్ సభ మాజీ స్పీకర్ గంటి మోహన చంద్ర బాలయోగి సేవలు అజరామరమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం బాలయోగి వర్ధంతి సందర్భంగా ఆయన కొత్తపేట బస్టాండ్ సెంటర్ లో విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే బండారు ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోనసీమ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన బాలయోగి పేరు ప్రఖ్యాతులు ఇక్కడి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని కొనియాడారు. కోనసీమలో ఏ మూలకు వెళ్ళినా ఈ ప్రాంత అభివృద్ధిలో ఆయన అడుగుజాడలు కనిపిస్తాయన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో జాతీయ రహదారి రావడానికి, జొన్నాడ వద్ద, సిద్ధాంతం వద్ద నూతనంగా రెండు వారధులు ఏర్పడడానికి ఆయనే కారణమన్నారు. యానాం - ఎదుర్లంక వారధి, బోడసకుర్రు వారధుల నిర్మాణానికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. అందరితో సఖ్యంగా ఉంటూ మన బాలయోగి, మనవారు అని పేరు తెచ్చుకున్నారన్నారు. ఒక దశాబ్ద కాలం పాటు వివిధ పదవుల్లో ప్రజా ప్రతినిధిగా సేవలందించి లోక్సభ స్పీకర్ గా ఉన్నత శిఖరాలకు చేరారన్నారు. వారి మీద అభిమానంతో వారి కుమారుడు హరీష్ మాధూర్ పార్లమెంటు సభ్యునిగా ఉన్నారన్నారు. ప్రజల హృదయాల్లో చిరకాలం బాలయోగి నిలిచి ఉంటారని కొనియాడారు. ఆయన బాటలో నడిచి కోనసీమ అభివృద్ధికి తామంతా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాపూరు అటవీ ప్రాంతంలో ప్రేమ జంట ఆత్మహత్య



నెల్లూరు జిల్లా రాపూరు (ఇది కద నిజం):– నెల్లూరు జిల్లా రాపూరు అటవీ ప్రాంతంలో ప్రేమికుల జంట ఆత్మహత్యకు పాల్పడింది. రాపూరుచిట్వేల్ ఘాట్ రోడ్డులోని 7వ మైలు వద్ద ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. నెల్లూరు జిల్లాముత్తుకూరుకు చెందిన ఆలపాక ప్రసన్న (25), తిరుపతి జిల్లా చిట్టమూరు మండలం చింతలతోపు గ్రామానికి చెందిన యాకసిరి సావిత్రి (24) ఒకే చెట్టుకు చున్నీలతో ఉరివేసుకుని ప్రాణాలు వదిలారు. సోషల్ మీడియా ద్వారా పరిచయమైన వీరిద్దరూ ప్రేమలో పడ్డారని, మృతురాలు సావిత్రికి ఇదివరకే వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలంలో కిరిణికాయ, హెల్మెంట్ బాడీ స్ప్రే, కూల్ డ్రింక్ బ్యాగు, అదేవిధంగా AP26BN6661మోటర్ సైకిల్ పురుగుల మందు డబ్బాలు లభ్యమవ్వగా.. మొదట విషం తాగి, ఆ తర్వాత ఉరివేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. పంగిలి గిరిజనులు గ్రామస్తుల సమాచారంతో రాపూరు పోలీసులు బ్యాగులో ఉన్నా మొబైల్స్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం రాపూరు యస్.ఐ. వెంకటరాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు

## నేరాల నివారణకు ప్రజలు సహకరించాలి.

**కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్**



మైదుకూరు, ఇది కద నిజం, మార్చి 03 : కడపజిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ గారి ఉత్తర్వుల మేరకు మైదుకూరు డిఎస్పి శ్రీ జి రాజేంద్రప్రసాద్ గారి పర్యవేక్షణలో మైదుకూరు పట్టణ సిఐ కె. రమణా రెడ్డి, మైదుకూరు రూరల్ సీఐ జె.శివ శంకర్,ఖాజీపేట సీఐ వంశీధర్,ఎస్ఐ లు రమణ, బి.మఠం ఎస్ ఐ శివ ప్రసాద్, దువ్వూరు ఎస్ఐ ధనుంజయుడు,చాపాడు ఎస్సై చిన్న పెద్దయ్య మరియు సిబ్బంది,హోంగార్డ్స్ తో కలిసి మైదుకూరు పట్టణం పరిధిలోని ఇందిరమ్మ కాలనీ, వెంకట సుబ్బయ్య కాలనీ, సుందరయ్య నగర్ లలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. అలాగే పాత నేరస్తులు,సస్పెక్ట్ షీటర్, గంజాయి నేరస్తుల ఇళ్లల్లో తనిఖీలు చేశారు. పాత నేరస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. వాహన పత్రాలు సరిగా లేని 21 బైక్ లను మరియు 6 ఆటోలనుస్వాధీనం చేసుకున్నారు. ఇందిరమ్మ కాలనీ ప్రజలతో మాట్లాడుతూ ...నేరాల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. చట్టవ్యతిరేక,అసాంఘిక కార్యక్రమాల గురించి ఎప్పటికప్పుడు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసు వారికి సమాచారం అందించాలని ప్రజలను ఉద్దేశించి తెలియజేశారు...

## కుంభాభిషేకానికి దేవాదాయమంత్రికి ఆహ్వానం.



ఇంద్రకీలాద్రిపై కలిసి ఉన్న కుంబాభిషేకం మహోత్సవానికి , విచ్చేయవలసిందిగా దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రమణారెడ్డి దుర్గగుడి వైదిక మండలి ఆహ్వానించారు. మార్చ్ ఆరో తేదీ నుండి ఎనిమిదో తేదీ వరకు వరకు జరుగబోయే కుంభాభిషేక కార్యక్రమం ఆహ్వాన పత్రికను,రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ శ్రీ కె. రామచంద్రమోహన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీ బొర్రా రాధాకృష్ణ (గాంధీ ), కార్యనిర్వహణాధికారి వికె శీనానాయక్ పాల్గొన్నారు. స్థానాచార్య శ్రీ వి. శివ ప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు శ్రీ ఎల్. దుర్గా ప్రసాద్, వేద పండితులు, అర్చకులు దేవదాయ శాఖ మంత్రివర్యులకు వేద ఆశీస్సులు అందజేసి, శ్రీ అమ్మవారి ప్రసాదం అందజేశారు.

## ఉప్మాకలో కల్యాణ మహోత్సవం ఘనంగా పల్లకి సేవలో పాల్గొన్న వైఎస్సార్సీపీ నేతలు




ఇది కద నిజం, మార్చి 3 (నక్కపల్లి) : పాయకరావుపేట నియోజకవర్గం,నక్కపల్లి మండలంలోని శ్రీ కల్కి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన వార్షిక కల్యాణమహోత్సవం భక్తుల సందోహంతో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి పల్లకి సేవలో పాల్గొని భక్తిశ్రద్ధలతో సేవచేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శీరం నరసింహ మూర్తి,పాయకరావుపేట వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు గెడ్డమూరి శ్రీనివాసరావుతో పాటు పలువురు నాయకులు,భక్తులు పాల్గొన్నారు.




### బోయపాటి శ్రీను కొత్త సినిమా..

## స్టార్ హీరో గ్రీన్ సిగ్నల్



బోయపాటి శ్రీను దర్శకత్వంలో వచ్చిన 'అఖండ-2' ఆశించినంత రేంజ్‌లో మెప్పించలేదు. ఈ మూవీ తర్వాత బోయపాటి శ్రీను తదుపరి చిత్రంపై ఇప్పటి దాకా ఎలాంటి క్లారిటీ రాలేదు. ఒక సమయంలో అల్లు అర్జున్‌తో ఒక సినిమా తీస్తున్నట్లు వార్తలు వచ్చాయి. కానీ, అది వర్కౌట్ కాలేదు. దీంతో బోయపాటి తన మనసుమార్చుకుని రానా దగ్గుబాటితో ఒక సినిమా తీయబోతున్నట్లు తెలుస్తోంది. ఇండస్ట్రీ సమాచారం ప్రకారం, బోయపాటి తన రాబోయే చిత్రంలో ప్రధాన పాత్ర కోసం రానా దగ్గుబాటిని సంప్రదించాడని తెలుస్తోంది. చర్చలు ప్రారంభ దశలోనే ఉన్నాయని భావిస్తున్నప్పటికీ, ఇరువైపుల నుండి ఇంకా అధికారికంగా ధృవీకరణ రాలేదు. కమర్షియల్ యాక్షన్ చిత్రాల వైపు ఆసక్తి చూపిస్తున్న రానా కూడా.. ఈ ప్రాజెక్ట్‌లో నటించే అవకాశం ఉందని తెలుస్తోంది. బోయపాటి శ్రీను కొద్దిరోజుల క్రితం ముంబై వెళ్లిన విషయం తెలిసిందే. అట్లీ మూవీ షూటింగ్‌లో ఉన్న అల్లు అర్జున్‌ను కలిసి కథ కూడా చెప్పారట. బోయపాటి చెప్పిన కాన్సెప్ట్ బన్నీకి బాగా నచ్చిందని వార్తలు కూడా వచ్చాయి. అయితే, ప్రస్తుతం అల్లు అర్జున్ లాక్ చేసిన సినిమాలన్నీ పూర్తి కావలంటే కనీసం 4ఏళ్లు పడుతుంది. అందుకే బోయపాటి మరో కథను రెడీ చేసి రానాకు వినిపించారని తెలుస్తోంది.

## అది చూశాకా నేనే షాకయ్యా



సోషల్ మీడియా గురించి టాలీవుడ్ నటుడు తనికెళ్ల భరణి మాట్లాడారు. తనికెళ్ల భరణి ఆస్తులు చూస్తే మీరంతా షాక్ అని ఒకరు థంబ్‌నెయిల్ రాసుకొచ్చారు. నిజంగా అది చూశాకా నేనే షాకయ్యా.. ఇంటిముందు అరడజన్ కార్లు కూడా ఉన్నాయని చూపించాడు. అదంతా చూసి మేము నవ్వుకున్నామని తెలిపారు.

ఇప్పుడు ఒకదేశంపై యుద్ధం జరుగుతోంది.. నేను ఒక దేశానికి సపోర్ట్ చేస్తున్నట్లు.. ఒక వర్గానికి మద్దతుగా చేస్తున్నట్లు ఇష్టమొచ్చినట్లు పెట్టేస్తున్నారని తనికెళ్ల భరణి అన్నారు. నేను అన్ని వర్గాలు, మతాలను గౌరవిస్తానని.. ఎవరికీ వ్యతిరేకం కాదని అన్నారు. నేను ఎప్పుడు ఇలాంటివి చేయలేదని.. భవిష్యత్తులో చేయనని తెలిపారు. ఇవీ చూసి నా మిత్రులు, శ్రేయోభిలాషులు బాధపడి ఉంటారని వెల్లడించారు. దయచేసి ఇలాంటి వాటిని ఎంకరేజ్ చేయొద్దు.. స్పందించవద్దని తనికెళ్ల భరణి కోరారు.

## నరకం అనుభవించా



హీరోయిన్ స్నేహ తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేక పరిచయం అవసరం లేదు. టాలీవుడ్‌లో హోమ్లీ, క్యారెక్టర్ రోల్స్‌లో తన ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. దక్షిణాది ఇతర భాషలలో కూడా చాలా సినిమాల్లో నటించి ఆకట్టుకుంది. ఇటీవల ఓ అవార్డ్ ఫంక్షన్‌లో తన భయంకరమైన ప్రమాదాన్ని, జీవితంలో ఎదురైన కష్టాలను షేర్ చేసింది. కెరీర్ పీక్‌లో ఉండగా సివియర్ అక్సిడెంట్ లో చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయని, 8 నెలల పాటు మంచానికే పరిమితం అయ్యానని తెలిపింది. ఆ రోజుల్లో "నరకం అనుభవించానని" కూడా గుర్తు చేసుకుంది. ఆ సమయంలో దర్శకుడు కరు పళనియప్పన్ 'పార్థిబన్ కనవు' కోసం అవకాశం ఇచ్చి నమ్మకం చూపారని, అదే ప్రోత్సాహం ఆమెను కెమెరా ముందుకు తేవడానికి కారణమయ్యిందని చెప్పింది. ఈ కష్టాల దశ ఆమెను మరింత బలంగా మార్చిందని ఆమె ఎమోషనల్‌గా వెల్లడించింది. స్నేహ అసలు పేరు సుహాసిని, ముంబైలో పుట్టి షార్జాలో పెరిగింది. 2000లో 'ప్రియమైన నీకు'తో తెలుగులోకి ప్రవేశం చేసి, రాధాగోపాలం, సంక్రాంతి, శ్రీరామదాసు, మధుమాసంతో పాటు అనేక సినిమాల్లో నటించింది. 2012లో తమిళ నటుడు ప్రసన్నను పెళ్లి చేసుకుని, తర్వాత సహాయ పాత్రల్లో కొనసాగుతూ ఇటీవల విజయ్ 'గోట్' సినిమాలో కనిపించింది.


### ఆ సినిమా సమయంలో

## విజయ్‌ని చూసి భయపడిన రష్మిక




ప్రేక్షకులు ఆదరిస్తున్న 'గీత గోవిందం''డియర్ కామ్రేడ్' జంట విజయ్ దేవరకొండరష్మిక మళ్లీ వార్తల్లోకి వచ్చారు. మార్చి 4న వీరి వివాహ రిసెప్షన్ జరగనుంది. రష్మికకు మొదట విజయ్‌ను చూసి భయముందని ఆమె పంచుకున్నారు. "కొత్త వ్యక్తులతో నటించడం బెరుకు కలిగించేది. కానీ విజయ్ చాలా కూల్, సెట్‌లో వాతావరణం పాజిటివ్‌గా ఉండేది. అందుకే షూటింగ్ సులభంగా జరిగింది" అని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం వీరు రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో రణబాలి చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబరులో విడుదలకు సిద్ధమవుతుంది.

## ఆ రూమర్స్ నమ్మకండి 'పెద్ది' టీమ్ విజ్ఞప్తి



'పెద్ది' రన్‌టైమ్‌పై వస్తోన్న రూమర్స్‌ను నమ్మొద్దని చిత్రబృందం స్పష్టం చేసింది. రామ్ చరణ్ హీరోగా, బుచ్చి బాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ డ్రామా నిడివి 3 గంటలకు పైగా ఉంటుందన్న వార్తలను టీమ్ ఖండించింది. ప్రస్తుతం ఫస్ట్ హాఫ్ మాత్రమే ఫైనల్ అయ్యిందని, సెకండ్ హాఫ్ షూటింగ్‌తో పాటు డబ్బింగ్, ఎడిటింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపింది. సినిమా ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధమవుతోందని పేర్కొంది.ఇక ఇప్పటికే మొదటి పాట హిట్ కాగా, తాజాగా విడుదలైన రెండో సాంగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఏ.ఆర్ . రెహమాన్ స్వరపరిచిన ఈ పాటకు రామ్ చరణ్ వేసిన ఎనర్జిటిక్ స్టెప్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

## 'సతీ లీలావతి' విడుదల వాయిదా





మెగా కోడలు లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలో నటిస్తున్న 'సతీ లీలావతి' చిత్రం విడుదల వాయిదా పడింది. దేవ్ మోహన్ హీరోగా, తాతినేని సత్య దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను మార్చి 6న విడుదల చేయాలని భావించినా, సాంకేతిక కారణాల వల్ల వాయిదా వేసినట్లు నిర్మాతలు తెలిపారు. కొత్త విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నారు.

దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో నరేష్, వీటీవీ గణేష్, సప్తగిరి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పెళ్లి తర్వాత లావణ్య నటిస్తున్న తొలి చిత్రం కావడంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

## 'సలార్ 2' ఆశ్చర్యపరుస్తుంది

☐ నిర్మాత విజయ్ కిరగందూర్



ప్రభాస్ హీరోగా, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందిన 'సలార్ : పార్ట్ 1 సీజ్ ఫైర్ ' సీక్వెల్‌పై ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. 'సలార్ 2: శౌర్యాంగ పర్వం' త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనున్నట్లు నిర్మాత విజయ్ కిరాగందురు వెల్లడించారు.

"సలార్ 2 అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. అభిమానుల ఆసక్తి మాకు తెలుసు. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం" అని ఆయన పేర్కొన్నారు.

అలాగే పార్ట్ 1 బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించిందని, ఓటీటీలోనూ మంచి స్పందన దక్కిందని తెలిపారు. దర్శకుడు ప్రశాంత్ నీల్ స్వీయవిమర్శ చేసుకునే వ్యక్తి అని, ఆయన విజన్ పార్ట్ 2లో మరింత మెరుస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు.